తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కాలువలో కారు బోల్తా



కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త
కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామానికి సమీపంలో ఓ వంతెన మలుపు వద్ద కారు అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది. శనివారం ఉదయం విద్యానగర్ నుంచి పలువురు వాకింగ్‌కు వెళుతున్న వారు కారు బోల్తాపడిన సంఘటన గురించి ఆరా తీశారు. బోల్తాపడిన కారు మాత్రం రాజస్తాన్ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌తో ఉంది. అయితే కారులో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. గేదె అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది. అయితే కోట పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## కమనీయం
# వరసిద్ధుని రథోత్సవం

### కిక్కిరిసిన భక్తజన సందోహం



కాణిపాకంలో శనివారం జరిగిన రథోత్సవం. (ఇన్‌సెట్‌లో) రథంపై ఊరేగుతున్న స్వామివారు)



రథం ముందు పిండి తలిగలు పైవేద్యంగా వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈకార్యక్రమానికి కీ॥శే॥ శ్రీ కె.యతిరాజులు నాయుడు, కాకర్లవారిపల్లె వారి జ్ఞాపకార్థం వారి కుమార్తె శ్రీమతి మీనాకుమారి, కీ॥శే॥ యన్.శివప్రసాద్ నాయుడు దంపతులు, శ్రీ కె. పూర్ణచంద్రారెడ్డి, మాజీ వి.ఎం.కాణిపాకం, కీ॥శే॥ శ్రీ కె.చంద్రశేఖరరెడ్డి, మాజీ వి.ఎం. వారి జ్ఞాపకార్థం వారి కుమారులు కె.హరిప్రసాద్‌రెడ్డి, కాణిపాకంలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉదయం దేవస్థానం వారిచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి చందనాలంకారం చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈఓ పట్టెం గురుప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులను ఆలయం నుండి తీసుకువచ్చి శోభాయమానంగా అలంకరించిన స్వామివారు ఊరేగే రథంపై అధిరోహింపజేశారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లకు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకస్వాములు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన అశేష భక్తజనం గణేష్ నామస్మరణల నడుమ ఉదయం రథంను కొంత దూరం లాగి వదిలిపెట్టారు. ఈసందర్భంగా భక్తులు రథంపై భక్తులు బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులను తీర్చుకున్నారు. అలాగే నారికేళ కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు రథానికి అర్చకులు మరోమారు ప్రత్యేక పూజలు నిర్వహించి అశ్వకదళాలు, కోలాటాలు, చెక్కభజనలు, లంబాడి నృత్యాలు, విచిత్ర వేషదారణలు, కీలు గుర్రాలు, పిల్లనగ్రోవి వంటి వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు ముందుకు సాగుతుండగా 'జైభోలో గణేష్ మహరాజ్‌కీ జై' అంటూ భక్తుల గణేష్ నామస్మరణలు మిన్నంటుతుండగా స్వామివారి రథం కాణిపాకం పురవీధుల్లో ముందుకు సాగింది. రథోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాలనుండి అశేషంగా తరలి వచ్చిన భక్తజనంతో కాణిపాకం పురవీధులన్ని పోటెత్తాయి. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, స్థానిక ఎస్సై ధరణీధరల ఆధ్వర్యంలో సుమారు 250 మంది పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విష్ణున్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

### ఉచిత ప్రసాదాల పంపిణి

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జరిగిన రథోత్సవం సందర్భంగా పలువురు దాతలు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. శనివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాదాల పంపిణీ కార్యక్రమంను స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈఓ పట్టెం గురుప్రసాద్‌లు ప్రారంభించారు. అలాగే పలువురు కాణిపాకం-అగరంపల్లె రహదారిలో వేలాదిమంది భక్తులకు పలువురు దాతలు ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాల ప్రసాదాలను, మజ్జిగ, నీళ్ళ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు.

# అంతా వివాదమే!



### కూటమి పార్టీల నేతలతో కలసి తిరుగుతున్నా నిస్సహాయతే!?
### జనసేన నేత తీరుపై తెలుగుతమ్ముళ్ళ ఆగ్రహం

ప్రభాతవార్త-తిరుపతి:
తిరుపతి నియోజకవర్గం నుండి జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన ఆరణి శ్రీనివాసులు వ్యవహారం తొలినుండి వివాదంగానే ఉందని కూటమిపార్టీల నేతలు భగ్గుమంటున్నారు. చిత్తూరు వైసిపి ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి టిక్కెట్ నిరాకరించడంతో జనసేనపార్టీలో చేరి తిరుపతి టిక్కెట్ తెచ్చుకున్నారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వడాన్ని కూడా తొలినుండి తిరుపతిలోని జనసేన పార్టీ నేతలు, ద్వితీయశ్రేణి నేతలు కొందరు వ్యతిరేకించారు. అంతేగాక బలిజ సామాజిక వర్గానికి చెందిన టిడిపి నేతలు కూడా అసంతృప్తి వ్యక్తం చేయడం, స్థానికులకు కాదని ఇతర ప్రాంతాల వాళ్ళకు ఇస్తే ఎలా పనిచేయాలనే నిరసన గళం వినిపించారు. చివరకు ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమిలో జనసేన పార్టీ కూడా టిడిపితో కలవడంతో తిరుపతిలో ఆయనను గెలిపించాలని స్వయంగా టిడిపి అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులకు గట్టిగా చెప్పారు. దీంతో టిడిపి నేతలు చేసేదిలేక ఆరణి నాయకత్వాన్ని తొలుత వ్యతిరేకించినా ఆ తరువాత పరిణామాలతో కలసి గెలిపించుకోక తప్పలేదు. ఎన్నికల్లో గెలవడంతో ఇప్పుడు ఆయన కూటమిపార్టీల నేతలతో కలసి తిరుగుతున్నట్లు అనిపిస్తున్నా లోలోపల వైసిపి నుండి వస్తున్న నేతలు, కార్యకర్తలకు పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అంతేగాక ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని అనేక మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లలో వైసిపి అధికారంలో ఉన్న ఛైర్మన్లు, మేయర్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను టిడిపిలోకి స్వాగతించి ఆ పార్టీ పరం చేసిన విషయం తెలిసిందే. చివరకు చిత్తూరు, కుప్పం మున్సిపల్ కార్పొరేషన్లు కూడా టిడిపిలో కలిసేలా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సి చాకచక్యంగా పావులు కదిపారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అందుకు భిన్నంగానే కథ నడుస్తోంది. 49మంది కార్పొరేటర్లుకుగాను ఒక స్థానానికి నేటికీ ఎన్నికలు జరగలేదు. ఒకరు మాత్రమే టిడిపి కార్పొరేటర్, మరో వైసిపి కార్పొరేటర్ హఠాన్మరణంతో ఆ డివిజన్ ఏడాదిన్నరగా ఖాళీగానే ఉంది. ఇక్కడ మేయర్ కుర్చీ, ఉప మేయర్ల కుర్చీలు కూడా వైసిపినేతలదే. ఓ ఉపమేయర్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఉన్న కార్పొరేటర్లు చాలావరకు టిడిపిలో చేరేందుకు సుముఖత చూపి రంగం సిద్ధం చేసుకున్నారు. జనసేనలో చేరేందుకు సుముఖంగా లేరనేది పార్టీలో గుసగుసలు. అయితే తిరుపతిలో జనసేన పార్టీ ఎమ్మెల్యే అధికారంలో ఉండటంతో టిడిపిలో చేరితే తనకున్న పట్టు కోల్పోతామనే అంతర్మథనంతోబాటు ఎంఎల్‌గా తనకు బలం ఉండదనేది ఆలోచనతో తనపూర్వపార్టీకి చెందిన వైసిపి కార్పొరేటర్లను కలుపుకునేందుకు పెద్దగా ఆసక్తిచూపడంలేదనేది రాజకీయనేతల విశ్లేషణ. మరీ ఈ నేపథ్యంలో తిరుపతిలో టిడిపి నేతలకు నామినేటెడ్‌పదవులు పందేరంలో కూడా ఎమ్మెల్యే తనదైన రీతిలో చక్రం తిప్పి వైసిపి నుండి వచ్చిన కొందరు నేతలు, కార్యకర్తలకు ప్రాధాన్యత నివ్వాలని యోచిస్తున్నారనేది తెలుగుతమ్ముళ్ళ ఆవేదన. ఇదేగాక ప్రతిరోజూ కూడా కొందరు వైసిపి కార్పొరేటర్లు ఆయన ఇంటివద్ద ఎమ్మెల్యేతోనే చెట్టపట్టాలు వేసుకుని తమ పనులు చక్కబెట్టుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. మరీ రానున్న రోజుల్లో తిరుపతి ఎమ్మెల్యే ఎంతవరకు కూటమి పార్టీలో అధిక బలమున్న టిడిపినేతలకు న్యాయం చేస్తారా?లేక ఎన్నికల్లో తనకు సహకరించలేదనే అంతర్మథనంతో అంతర్గతంగా కథ నడిపిస్తారా!అనేది కూడా తెలుగుతమ్ముళ్ళలో చర్చ మొదలైంది.

## కోనేటిరాయుడి బ్రహ్మోత్సవాలకు
# ముస్తాబవుతున్న తిరుమల





తిరుమల, సెప్టెంబర్ 14 ప్రభాతవార్తప్రతినిధి:
కొండలలోనెలకొన్న కోనేటిరాయుడు తిరుమలేశుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏడుకొండలు ముస్తాబవుతున్నాయి. కొండపై ఎటుచూసినా కలియుగవైకుంఠమే అన్నట్లు తలపించేలా అలంకరణలు, రంగవల్లులు, విద్యుద్దీపాల కటౌట్లు, ఆలయం పై భాగంలో, ఆలయం ముందు ఇలా ఒకచోటేమిటి కొండంతా భక్తులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో ఇరవైరోజుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఆరంభం కానుండటంతో శనివారం నుండి ఇంజనీరింగ్ పనులు, విద్యుద్దీపాలు కటౌట్లు ఏర్పాటు, రంగవల్లులు, మాఢవీధుల్లో కళాకారులను, భజనబృందాలను, స్వామివారిని ఆకట్టుకునేలా రకరకాల రంగులు వేస్తున్నారు. టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నాలుగుమాఢవీధుల్లోని గ్యాలరీల్లో ఉండే ప్రతి భక్తునికి సంతృప్తికరంగా వాహనసేవల దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు, అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారు.




## స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎక్సైజ్ శాఖలో విలీనం

### - సిఎం చంద్రబాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రలకు పాలాభిషేకం



చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖను చీల్చి ఏర్పాటైన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ప్రస్తుతం తిరిగి మాతృశాఖ అయిన ఎక్సైజ్ శాఖలో విలీనం అయ్యింది. గత ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలుగా విడగొట్టడంతో ఎక్సైజ్ శాఖ రెండుగా చీలిపోయింది. రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన సిఎం నారా చంద్రబాబునాయుడు ఎక్సైజ్ శాఖలోకి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను విలీనం చేస్తూ జిఓఎంఎస్ నెం.188 జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వున్న ఎనిమిది స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్లు మళ్ళీ మాతృశాఖ అయిన ఎక్సైజ్ శాఖలో విలీనం అయ్యాయి. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళుగా ఇప్పటి వరకు విధులు నిర్వర్తించి ప్రస్తుతం ఎక్సైజ్ శాఖలో విలీనం కావడంతో సిఎం నారా చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు చిత్తూరులో పాలాభిషేకం చేశారు.




# కూల్చివేతకు పదేండ్లు!




### నిర్మాణ ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితం
### నేటికీ వాస్తవరూపం దాల్చని వాణిజ్య సముదాయం
### పిచ్చిమొక్కలతో సంతృప్తి పడుతున్న పట్టణవాసులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఆదాయ వనరులైన ఆస్తుల్ని గత పాలనలో అస్తవ్యస్తం చేశారు. ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా పాలకులు దీనిని గురించి పట్టించుకోలేదు. ఓ షాపింగ్ కాంప్లెక్సును పడగొట్టి పిచ్చిమొక్కలు, ముళ్ళ పొదలు మొలవటానికి పూనుకోగా మరో విలువైన స్థలాన్ని రాయల్టీ పద్ధతిలో తమ్ముళ్ళకు ధారాదత్తం చేశారు. మరో ఆస్తికి సంబందించి కోర్టులో వ్యాజ్యం పేరుతో గాలికి వదిలారు. తెలుగుదేశం పాలనలో మున్సిపల్ ఆస్తుల్ని అనుభవించిన వారు వైకాపాలో కొనసాగారు. ఇలా అయితే మున్సిపల్ ఆదాయాలు ఎలా పెరుగుతాయి?

### పడగొట్టారు:వదలిపెట్టారు

శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఆదాయ వనరుల్ని పెంపొందించుకొనుటకు 1983లో శాంతారం జెపవార్ ఛైర్మెన్‌గా గతంలో ఇక్కడ పాత నెల్లూరు బస్టాండు ఉండగా దానిని షాపింగ్ కాంప్లెక్సుగా మలిచారు. 26 గదులు నిర్మించారు. దీని ద్వారా మున్సిపాలిటికి విశేషంగా ఆదాయాలు వచ్చేవి. 2004కు పూర్వం మున్సిపల్ సిబ్బందికి జీత భత్యాలు మున్సిపల్ ఆదాయ వనరుల నుంచే ఇచ్చే వారు. అప్పుడు ఈ ఆదాయాలు ఎంతో ఉపయోగపడేవి. అప్పటి ప్రభుత్వాలు కూడా మున్సిపాలిటీలు ఆదాయ వనరుల్ని పెంచుకునేందుకు షాపింగ్ కాంపేక్సులనిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించే వారు. ఈ నేపథ్యంలో అప్పటి శాసనసభ్యుడు అద్దూరు దశరధరామిరెడ్డి తన తండ్రి అద్దూరు బలరామిరెడ్డి పేరును పెట్టారు. ఈ షాపింగ్ కాంప్లెక్సులోనే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల మస్టర్ కార్యాలయం ఉండేది. పక్కనే కమిషనర్ క్వార్టర్స్ ఉండేవి.

### దేశం హయంలో పడగొట్టారు:

2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. ఛైర్మెన్ పదవి దేశం సీనియర్ నాయకునికి వరించింది. అయితే ఇక్కడి షాపింగ్ కాంప్లెక్సులో అసాంఘిక కార్యక్రమాలు జరగటం గమనించిన పాలకులు పడగొట్టడానికి నిర్ణయించారు.

మున్సిపల్ కాంప్లెక్సులో మద్యం దుకాణానికి అనుమతించారు. పక్కనే అసాంఘీక కార్యక్రమాలు అంటూ కోట్ల రూపాయల విలువైన భవనాన్ని కాలం చెల్లిందని పట్టుబట్టి పడగొట్టారు. పడగొట్టు సమయంలో కొత్త భవనాల నిర్మాణానికి నిధులున్నాయా? అంటే తాము ప్రభుత్వం నుంచి సాధిస్తామని ప్రకటించారు. అయితే పడగొట్టిన నాయకుడు మృతి చెందటం తరువాత వచ్చిన పాలకులు పట్టించుకోలేదు. ఆ తరువాత వైకాపా పాలన వచ్చింది వారు పట్టించుకోలేదు. దాంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

## శివయ్య సేవలో సమాచార శాఖ డైరెక్టర్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన భోళాశంకరుని శనివారం రాష్ట్ర సమాచార, పబ్లిక్ రిలేషన్ శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితుల వేద మంత్రాలతో మేళ తాళాలు మంగళవాయిద్యాలతో పిఆర్ఓ రవి స్వాగతం పలికారు.



## సిఎం చంద్రబాబు..మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం

కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తూ ఎక్సైజ్ శాఖను ప్రభుత్వం కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం ట్ల స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సిఐ సృజన్‌బాబు అధ్వర్యంలో సిఎం చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా తమను ఎక్సైజ్ శాఖలో కొనసాగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సై అన్వేష్, సిబ్బంది నాగరాజు, మధు, దేవేంద్ర, కృపావతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు పాతిక మంది ఎంపిక

కుప్పంరూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



కుప్పం లయన్స్‌క్లబ్, పిఇఎస్ ఆస్పత్రి అధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. మొత్తం వంద మంది శిబిరానికి హాజరు కాగా వారికి వైద్యులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఆపరేషన్లకు పాతికమందిని ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు ప్రజలకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సలహాదారు డా॥ మహేష్, సభ్యులు పిజి సెల్వం, సెంధిల్‌కుమార్, చరణ్, కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ ఉద్యోగుల్ని ఆదుకున్న ఘనత సిఎం చంద్రబాబుదే

కుప్పంరూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



గత వైకాపా ప్రభుత్వ హయాంలో జీతాలు లేక ఇబ్బందులు పడ్డ ద్రవిడ వర్సిటీ ఉద్యోగుల్ని ఆదుకున్న ఘనత సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని కుప్పం తెదేపా పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఉద్యోగులంటే సిఎం చంద్రబాబుకు ఎనలేని గౌరవమన్నారు. 13నెలల పాటు వేతనాలు లేక ఇబ్బందులు పడ్డ వర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 2.46కోట్ల మేర నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఉద్యోగులు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు.

## నేడు బిఆర్‌డి ఆస్పత్రిలో ఉచిత సంతానసాఫల్య వైద్య శిబిరం

కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

కుప్పంలోని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సంతానం లేని దంపతులకు ప్రయోజనం కల్పించేందుకు ఈ శిబిరం ఏర్పాటుచేశామన్నారు. బెంగళూరు నోవా ఐవిఎఫ్ డా॥ లావణ్య, ప్రముఖ గైనకాలజిస్ట్ డా॥ హరిత మండవ అధ్వర్యంలో సంతానం లేని దంపతులకు తగు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 7729028405,9398631629నెంబర్లను సంప్రదించాలన్నారు.

## రాజీ పరిష్కారాలతో కిక్కిరిసిన రాజనాలబండ

చౌడేపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



బాధితులు, అనుమానితుల మధ్య రాజీ మార్గం, సమస్యల పరిష్కారంతో రాజనాలబండ కిక్కిరిసింది. బండపై తిరుణాళ్ళు, వినాయకచవితి సందర్భంగా వాయిదాలు వేసుకొన్న బాధిత, అనుమానితులు శనివారం ఒక్కసారిగా రావడంతో రాజనాలబండ మరొకసారి తిరుణాళ్ళను తలపించింది. చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కొందరు సమస్యలపై రాజీ పడి వెళ్ళగా, మరికొందరు సత్యప్రమాణాలు చేసారు. ఇంకొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. మరో వైపు నగదు, బంగారం లభ్యమయిన వారు ప్రసన్న ఆంజనేయస్వామి చెంత వుంచి దక్కించుకొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామిలకు విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు టిటిడి సిబ్బంది పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

***దొంగలించబడ్డ సొత్తు లభ్యం*** పుంగనూరుకు చెందిన భవానీ ఇంట్లో ఇటీవల 20గ్రాముల బంగారం నెక్లస్ చోరీకి గురైంది. చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం కనిపించలేదు. దీంతో బాధితులు రాజనాలబండను ఆశ్రయించారు. రాజనాలబండ ప్రసన్న ఆంజనేయస్వామి మహిమ తెలిసిన అనుమానితుల్లో ఒకరు బంగారం నెక్లస్‌ను 13న ఉదయాన్నే భవానీ ఇంటి ముందు పడేశారు. స్వామివారి మహిమగా భావించిన ఆమె కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ప్రసన్న ఆంజనేయస్వామికి

## పలు పాఠశాలలో.జాతీయ భాషా దినోత్సవ వేడుకలు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణంలో ఆదివారం పలు పాఠశాలల్లో జాతీయ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగానిర్వహించారు. విద్యార్థిని,విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో వచ్చి హిందీ కవితలు,పాటలు, నృత్యాలతో కనువిందు చేసారు.

**విజయం పాఠశాల:** సుందరరాజపురంలోని విజయం సిబిఎస్ఇ పాఠశాల నందు హిందీ దివస్ వేడుకలను పాఠశాల అధ్యక్షులు తేజోమూర్తి, కార్యనిర్వహణ అధ్యక్షురాలు డాక్టర్ శైలజామూర్తిలు నిర్వహించారు. హిందీ భాష గొప్పతనాన్ని, ఆవశ్యకతలను విద్యార్థులకు వివరించారు.అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.బి కౌశల్య, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బృందావన్ పాఠశాల:** సంతపేటలోని బృందావన్ పాఠశాలలో వ్యవస్థాపకులు శైలజ, డైరెక్టర్ ప్రియ చేతుల మీదుగా పాఠశాల ప్రార్థనమందిరంలో పూజాకార్యక్రమాలతో హిందీ భాషా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. హిందీ భాష ప్రాముఖ్యతను తెలుపుతూ హిందీభాషపై ప్రముఖ హిందీ కవుల వేషధారణ, అక్షర విన్యాసం, పిల్లలచే హిందీ భాషపై పాటలు, పద్యాలు, కవితలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘం ఏర్పాటు

తొట్టంబేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



పట్టణంలోని బంగారమ్మ కాలనీ అభివృద్ధి కోసం బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘం నూతనంగా ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు నూతలపాటి వనమాలినాయుడు శనివారం పేర్కొన్నారు. బంగారమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో కాలనీ వాసుల సమక్షంలో నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులుగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా మాధవయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, గోవిందస్వామిరెడ్డి, సోమశేఖర్‌నాయుడు, లీలామోహన్ తదితరులును ఎన్నుకున్నారు. సంఘం మౌళిక సదుపాయాలు అభివృద్దికి కృషి చేస్తుందని తెలిపారు.

## గుమ్మడి మురళికి సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు

.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

గుమ్మడిమురళికి ఉత్తమ ఉపాధ్యాయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును ప్రధానం చేశారు. డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణన్ 137వ జయంతిని పురస్కరించుకుని కర్ణాటక, తమిళనాడు మరియు రెండు తెలుగు రాష్ట్రాల్లో చేపట్టిన సర్వే ఆధారంగా తిరుపతిజిల్లా తరపున గుమ్మడి మురళీ గుర్తింబడి ఉత్తమ ఉపాధ్యాయులుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు 2024ను తిరుపతి విశ్వం హైస్కూల్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ఆయన మనుమడు డాక్టర్ జి.సుబ్రమణ్యశర్మచేతులమీదుగా అందుకున్నాడు. ఈసందర్భంగా పలువురు మురళీని అభినందించారు.

## సంస్కృతి..సంప్రదాయాలకు చిహ్నం ఓనమ్

– కెఇసి వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్

కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఓనమ్ పండగ అని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం కుప్పం నర్సింగ్ కాలేజ్‌లో కేరళ ప్రజల సంప్రదాయ పండగను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓనమ్ పండగ ప్రతి ఒక్కరి జీవితంలో నూతనమైన సంతోషాన్ని నిలపాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా విద్యార్థినులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు.ప్రిన్సిపాల్‌విమలజోసెఫ్, కెడిసిప్రిన్సిపాల్‌సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు కుప్పం డాక్టర్లచే 7.64లక్షల విరాళం

**కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు కుప్పంలోని వైద్యులు భారీ విరాళాన్ని అందజేశారు. సిఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కుప్పం శాఖ తరపున డా॥ సురేష్‌బాబు, డా॥ సుధీర్, డా॥ శివప్రకాష్, డా॥ మంజునాథ్, డా॥ ప్రశాంత్, ఇతర వైద్యులు కలిపి మొత్తం 7.64లక్షల రూపాయల విరాళ ంను చంద్రబాబు వ్యక్తిగత సహాయకులు మనోహర్, సలహాదారు నరేష్ చారి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్ జాకీర్‌లకు అందజేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సీతారామ్ ఏచూరి ఆశయ సాధన సిపిఎం ఎజెండా : గంగరాజు

చౌడేపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



సిపిఎం జాతీయ కార్యదర్శి దివంగత సీతారామ్ ఏచూరి ఆశయ సాధన సిపిఎం ఎజెండా అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అన్నారు. మండల సిపిఎం మహాసభను స్థానికంగా నిర్వహించారు. తొలుత దివంగత సీతారామ్ ఏచూరి మృతికి నివాళులర్పించారు. ఆయన పోరాట పటిమ, జీవిత చరిత్రను గుర్తు చేసుకొన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎం పార్టీ సమాజంలో పేదల గుండెల్లో చరగని ముద్ర వేసుకొందన్నారు. మండలంలో బోయకొండ బాధితులు, మహిళా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు, రెవిన్యూ సమస్యల పరిష్కారం చేసే దిశగా అడుగులేయాలని మహాసభలో తీర్మానం చేసారు. డాక్టర్ చంద్రను సిపిఎం మండల కార్యదర్శిగా నూతనంగా ఎన్నుకొన్నారు. సిపిఎం నాయకులు గిరిధర్, రామకృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్

చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



చిత్తూరు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ శనివారం విధుల్లో చేరారు. ఇది వరకు చిత్తూరు మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జె.అరుణను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఆమె స్థానంలో పుంగనూరు మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహప్రసాద్‌ను ప్రభుత్వం చిత్తూరు మున్సిపల్ కమీషనర్‌గా నియమించింది. వారం రోజుల క్రితం మున్సిపల్ కమీషనర్‌గా నరసింహప్రసాద్ బాధ్యతలు స్వీకరించినప్పటికీ ప్రభుత్వం హడావుడిగా విజయవాడ వదర సహాయక చర్యలు చేపట్టడానికి మున్సిపల్ కమీషనర్‌ను అక్కడికి పంపడంతో ఆయన బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరకుండానే విజయవాడ వదర బాధితులకు సహాయం చేయడానికి వెళ్ళిపోయారు. ఈ క్రమంలో విజయవాడలో విధులు ముగించుకుని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ శనివారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరారు.

## ఎమ్మెల్యేను సత్కరించిన చిత్తూరు ప్రెస్‌క్లబ్ కమిటీసభ్యులు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:



కాణిపాకంలోని అతిధిగృహంలో పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీమోహన్‌ను శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్ నూతనకమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఎంపికైన అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, కాళేశ్వరరెడ్డిలను సత్కరించి ఇతర సభ్యులను అభినందించారు. పాత్రికేయ మిత్రులకు ఎలాంటి సహాయసహకారాలు అవసరమున్న ముందువరుసలో తాను వుంటానని, త్వరలో చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ను సందర్శించి పాత్రికేయులతో ముఖాముఖి పాల్గొంటానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కోశాధికారి అనిల్, ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, శివప్రసాద్, సహాయ కార్యదర్శి నవీన్, కమిటీ సభ్యులు శివ, రాజేష్, ఏపియుడబ్ల్యుజె కార్యదర్శి మురళీ, కార్యనిర్వాహక కార్యదర్శి అశోక్, సభ్యులు సురేష్ తదితరులు వున్నారు.

## కాణిపాకం సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం గోడపత్రిక ఆవిష్కరణ

కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిష్ఠాత్మక ఎఐసిటిఇ వారి అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకి సంబంధించిన గోడపత్రికను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రీహరిరెడ్డి, ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు శనివారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఫైనట్ ఎలిమెంట్ అప్లికేషన్స్ ఇన్ ఆడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ అనే అంశంపై మెకానికల్ విభాగంలో నవంబర్ 4 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు కళాశాల ఆవరణలో అధ్యాపకులకు శిక్షణ తరగతులు జరుగుతాయి. ఈ ప్రోగ్రాంకు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటి మద్రాస్ నుంచి డాక్టర్ శివశ్రీనివాస్, డాక్టర్ అమృత లింగం, ఐఐటి తిరుపతి నుంచి ప్రొఫెసర్ రవిశంకర్ ఎన్ఐటి వరంగల్ నుంచి డాక్టర్ రవికుమార్, ఎన్ఐటి తిరుచి నుంచి ప్రొఫెసర్ కె.శివప్రసాద్, రాష్ట్ర ప్రముఖ విద్యాలయాలైన జెఎన్‌టియుఎ అనంతపూర్ నుంచి ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, ఆంధ్రా యూనివర్శిటీ నుంచి ప్రొఫెసర్ కె.రాంజి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. అంతర్జాతీయ సంస్థలైన డెసాల్ట్ సిస్టం మరియు ఆన్సిస్ ఇండియా నుంచి ప్రముఖ ఇంజనీర్లు దినేష్, రవిశంకర్ 3డి ప్రింటింగ్‌పై శిక్షణ ఇస్తారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఎఐసిటిఇ ప్రతి సంవత్సరం కొన్ని కళాశాలలను ఎంపికచ ఏసి ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ జరపడానికి అవకాశం కల్పిస్తారని తెలిపారు. ఎన్‌బికెఆర్ కళాశాలకు ఎన్‌బిఏ మరియు ఎన్ఏఏసి అక్రిడేషన్ వల్ల ఈ అవకాశం కలిగిందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు దేశం నలుమూలల నుంచి అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు.

## ఎన్‌బికెఆర్ వ్యాయామ అధ్యాపకునికి అవార్డు ప్రదానం

కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్ బికెఆర్ ఐఎస్ టిలో వ్యాయామ అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డిని 2024 విద్యాసంవత్సరానికి గాను జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్.సు దర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్యలు డాక్టర్ మల్లికార్జునరెడ్డి వ్యాయామ విద్యా విభాగానికి చేసిన విశిష్ట సేవలను గురించి ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, అన్ని విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఎన్‌బికెఆర్ కళాశాలలో పనిచేస్తున్న పీడీకి దక్కిన గౌరవాన్ని పురస్కరించుకొని సంతోషం వ్యక్తం చేశారు.

## కారు, ట్రాక్టర్ ఢీ

కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



కోట మండలం చంద్రశేఖరపురం గ్రామం వద్ద శని వారం ఓ కారు ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో కారు ముందు నుజ్జునుజ్జయింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి వాకాడు వైపు వస్తున్న కారు చంద్రశేఖరపురం వద్ద ఊనగుంటపాలెంకు చెందిన ట్రాక్టర్ కోట వైపు వస్తుండగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారు ముందు భాగా దెబ్బతిన్నది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని రైతులు 40 వేల ఎకరాలు వరిపంట సాగు చేశారని, విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎక్కువ తెగుళ్ల సోకడం వల్ల దిగుబడి పడిపోయిందని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్‌ను బిజెపి జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చేవూరు వినయ్‌రెడ్డి కోరారు. ఎకరాకు నాలుగు పుట్లు దిగుబడి రావాల్సి ఉందని, రెండు పుట్లకు పడిపోయిందన్నారు. రైతులను దళారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. రైతుల పరిస్థితులను పరిశీలించి పుట్టి ధాన్యాన్ని రూ.22 వేలకు కొనుగోలు చేసే విధంగా రైస్‌మిల్లర్లను ఆదేశించాలని కోరారు. అంతేకాకుండా సోమశిల జలాశయంలో 50 టిఎంసిల నీటి నిల్వ ఉన్నందున వెంటనే ఐఏబి సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలని కోరారు. నీటిపారుదల శాఖ కాలువలన్నీ గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో పూడిపోయి ఉన్నాయని, అన్ని కాలువలను పూడిక తీయించాలని కోరారు. జిల్లాలోని కనిగిరి చెరువులాంటి అనేక చెరువులకు గండ్లు పడి తెగిపోయే ప్రమాదంలో ఉన్నందున వెంటనే యుద్ధప్రాతిపదికపై మరమ్మతులు చేయాలన్నారు. రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయారని, ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని కోరారు.

## అందరివాడు హర్షవర్ధనుడు

– మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



సూళ్లూరుపేట రాజకీయాల్లో తనదైన శైలిలో రాజకీయ ప్రస్థానం కొనసాగించి అందరివాడుగా పేరు తెచ్చుకున్న ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి మన ముందు భౌతికంగా లేకపోయినా ఆయన ఈ ప్రాంతానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపి, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఆయన తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి సౌజన్యంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంచినీటి ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్షవర్ధన్‌రెడ్డి రాజకీయంగానే కాకుండా సామాజికంగాను ఈ ప్రాంతంలో సేవలు అందించారన్నారు. ఎన్నో పదవులను అనుభవించి వాటికి వన్నె తెచ్చిన నేతగా హర్షవర్ధన్‌రెడ్డి పేరొందారని నెలవల తెలిపారు. ఆయన చూపిన జాడలోనే ఆయన కుటుంబం నడుస్తూ ఆయన సతీమణి శ్రీవాణి, కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. హర్షవర్ధన్‌రెడ్డిని ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చెక్కుచెదరకుండా ఆయన స్థానాన్ని పదిలం చేసే దిశలో భాగంగా ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామమని నెలవల అన్నారు. ఈ సందర్భంగా బర్త్‌డే కేక్ కట్ చేసి ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, మాధవనాయుడు, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, గాది నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో నవజీవన్ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ సంస్థ సిసిపియు ప్రాజెక్టు సంయుక్త సహకారంతో ఎయిడ్స్ నివారణ ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి ర్యాలీని ప్రారంభించి పట్టణంలో ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను ప్రజలకు వివరిస్తూ, చైతన్యపరుస్తూ ర్యాలీ కొనసాగించారు. మీకు తెలుసా అనే పేరుతో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్ రమేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది నందిని, హరిత, మారియమ్మ, ఎల్.శిరీష, శ్రీవల్లిక, రేవతి, ఉమా పాల్గొన్నారు. అనంతరం సంస్థ ఎఎన్ఎం హరిత 25 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి వారి స్థితిని తెలియజేశారు.

## పౌష్టికాహారమే తల్లీబిడ్డలకు శ్రేయస్కరం

చిట్టమూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, పిల్లలు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారం శ్రేయస్కరమని సెక్టార్ సూపర్‌వైజర్ నారాయణమ్మ తెలిపారు. శుక్ర, శనివారాలలో ఈశ్వరవాక పంచాయతీ పరిధిలోని ఈశ్వరవాక అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, పిల్లలు, బాలింతలు, గ్రామప్రజలతో సమావేశమైన ఐసిడిఎస్ సిబ్బంది పౌష్టికాహార విశిష్టత గురించి వివరించారు. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చి తల్లులు పిల్లలకు అవసరమైన పోషకాహార పదార్థాలను అందజేస్తుందని అన్నారు. పౌష్టికాహారంపై గ్రామస్థులు సైతం అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నారాయణమ్మ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈశ్వరవాక పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎఎన్ఎం, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

దొరవారిసత్రం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

మండలంలోని శ్రీధనమల్లి సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం జరిగింది.సేకరించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూళ్ళూరుపేటకు చెందిన ప్రదీప్,జగదీష్‌లు మోటార్‌సైకిల్‌పై కోటకు వెళ్ళి పనులు పూర్తిచేసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ప్రదీప్,జగదీష్‌లు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108 సాయంతో చికిత్స నిమిత్తం సూళ్ళూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లోక్ అదాలత్ తీర్పు ..సుప్రీంకోర్టు తీర్పుతో సమానం

తొట్టంబేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



లోక్‌అదాలత్ తీర్పుసుప్రీంకోర్టు తీర్పుతో సమానం అదని సత్వర న్యాయం కోసం లోక్‌అదాలత్ ఉపయోగించుకోవాలని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ కోరారు. హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో ఇచ్చే తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం అన్నారు. దీనికి అప్పీలు లేదని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని అలాగే కోర్టులో పెండింగ్‌లో ఉన్ని రకాల రాజీపడని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసులు, కార్మిక కేసులు, సివిల్‌కేసులు, చెక్‌బౌన్స్ కేసులు మరియు కోర్టు వరకు వెళ్ళని రాజీపడదగిన తగాదాలు లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. నేడు లోక్‌అదాలత్‌లో ఇరుపక్షాల కక్షిదారులకు న్యాయం జరిగే విధంగా కొన్ని కేసులను సత్వర తీర్పు ఇచ్చామని తెలిపారు. మొత్తం 670 కేసులు పరిష్కారవగా వివిధ కేసుల నుంచి రూ.83,15,000లక్షలు నగదు రికవరీచేసినట్లు తెలిపారు కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి, జూనియర్‌సివిల్‌జడ్జి కృష్ణ ప్రియ మరియు అన్ని శాఖల ఉన్నతాధికారులు, బ్యాంకు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేతశాఖ మంత్రికి వినతిపత్రం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



అమరావతి రాష్ట్ర సచివాలయంలో వెనుకబడిన వర్గాలు మరియు చేనేత శాఖ మంత్రి సవితమ్మను రాష్ట్ర కార్యదర్శి, బిసి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలు విషయాలను చర్చించి బిసి వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్ళి చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులను వారికి తెలియజేసి పరిష్కరించాల్సిందిగా కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో వెనుకబడిన వర్గాలని రాజకీయంగా గుర్తించి ఇక్కడ ఉన్నటు వంటి నామినేటెడ్ పదవుల్లో అత్యధిక భాగంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి ఇప్పించాలని కోరారు.

## శివయ్య సేవలో హైకోర్టు జడ్జి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి కుటుంబ సభ్యులతో పూజలు జరుపుకున్నారు. వారికి ప్రోటో కాల్ మేరకు దక్షిణ గోపురం వద్ద ఎసి మల్లికార్జున్ ప్రసాద్, పిఆర్ఓ రవిలు స్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసుకున్నారు. జస్టిస్ టి.మల్లికార్జున్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన శనీశ్వరాలయం, యాగశాలలో జరుగుతున్న పూజలు, అభిషేకాలకు సంబంధించి అడిగి తెలుసుకున్నారు. దర్శనానంతరం వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు. ఎసి మల్లికార్జున్ ప్రసాద్ స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. అర్బన్ సిఐ డి.గోపి బందోబస్తును ఏర్పాటు చేసారు.

## నిత్యాన్న ప్రసాదానికి పేట వాసుల విరాళం:

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ పథకంలో ప్రతి రోజూ దేవస్థానం మధ్యాహ్నం 5 నుంచి 7 వేల మందికి భోజన వసతి కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు చెందిన సూళూరుపేట వాసులు రూ.1.0116లక్షల విరాళాన్ని అందించారు. సూళూరుపేట మండలం శ్రీధనపల్లికి చెందిన వేనాటి రమణారెడ్డి వేనాటి దేవేంద్రరెడ్డి పేర ప్రతి ఏడాది సెప్టెంబర్ 14న అన్నదానం జరపాలంటూ ఒక లక్షా నూట పదహారు రూపాయలను విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్‌కు అందించారు. దాతలతో పాటు ఆలయ సిబ్బంది శ్రీనాథ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## కైలాసగిరిలో గణపతి హోమం: అన్నదానం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వాడ వాడల్లో వినాయక విగ్రహాలు వెలసినాయి. వాడ వాడల్లో వినాయకుడు పూజలు అందుకుంటున్నారు. సమాజంలో శాంతి సౌఖ్యం ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఆయా ప్రాంతాల్లోని యువకులు గణపతి హోమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా అన్నదానాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కైలాసగిరి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక ఆలయం వద్ద 'గణపతి హోమాలను' ఏర్పాటు చేసారు. ఉదయం నుంచి ఆలయం వద్ద హోమాలు ఏర్పాటు చేసారు. ప్రత్యేకంగా వేదపండితులతో యాగాన్ని నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రాల ఘోషతో కైలాసరి కాలనీ పర్వత పంక్తులు పునీతమయ్యాయి. ఈ యాగాలు, హోమాలకు ఎల్ఐసి కాలనీ, రాజీవ్‌నగర్, రామచంద్రాపురం గ్రామానికి చెందిన ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమాలను సప్తగిరి ప్రసాద్ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఏర్పేడు మండల తెలుగుదేశం నాయకుడు పొన్నారావు హాజరయ్యారు. యాగాలు, హోమాల అనంతరం ఇక్కడ వేలాది మంది కి భోజన వసతి కల్పించారు.

## శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించండి

-రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయక ప్రధాన ప్రాంతమని నియోజకవర్గంలోని ప్రాజెక్టులకు ప్రత్యేకనిధులు కేటాయించాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు పలు మంత్రులను కలసి అభ్యర్ధించారు. ముఖ్యంగా వైకాపా పాలనలో నియోజకవర్గ అభివృద్ధి మూలబడిందని మంత్రుల దృష్టికి తెచ్చారు. నియోజకవర్గంలో మున్సిపాలిటీ , దేవస్థానం రెండు కళ్ళుగా ఉన్నాయని రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగ్గా శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి ఎన్నికలు జరగనందువల్ల అభివృద్ధి కుటుంపడిందని సంబంధితశాఖ మంత్రి నారాయణకు విన్నవించారు. కాగా దేవస్థానం మాస్టర్‌ప్లాన్ అమలుకు గతంలో పోతుగుంటగురవయ్యనాయుడు ఛైర్మన్‌గా ముందుకు తీసుకెళ్ళారని వైకాపా హయాంలో పరిశీలనపేరుతో. కన్సల్టెన్సీలతో మూలపడేశారని దేవాదాయశాఖ మంత్రి ఆనంరామనారాయణరెడ్డికి వివరించారు. తెలుగదేశం పాలన గురవయ్యనాయుడు ఛైర్మన్‌గా రాజగోపురం నిర్మాణం ఆలయాన్ని బంగారు మయంగా చేశారని ఐదేళ్ళ వైకాపా పాలనలో ప్రకటనలకు ప్రచారాలకు పరిమితమై ఆలయాన్ని వ్యాపార రంగంగా మార్చి దళారుల అడ్డాగా మార్చారని ఐదేళ్ళలో జరిగిన శివరాత్రి ఖర్చులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుపేదలకు సంబందించిన రాజీవ్‌నగర్ వైకాపా నేతల వ్యాపారానికి అడ్డాగా మారిందన్నారు. తెలుగుదేశంహయాంలో నిర్మించిన 5వేల టిడ్కో ఇండ్లు నేటికి లబ్దిదారులకు ఇవ్వలేదని ఇందులో వైకాపా నేతలు కార్యకర్తలు అధికారులు అమ్ముకున్నారని ఈకుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపి నిరుపేదలకు న్యాయం చేయాలని మున్సిపల్ మంత్రి నారాయణను కోరారు. అనంతరం ఆర్థికశాఖమంత్రి పయ్యావులకేశవ్,, ఆరోగ్యశాఖ మంత్రి అనగాని సత్యకుమార్, ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మలరామానాయుడు మరియు హోం శాఖ మంత్రి వంగలపూడి అనితలను మర్యాదపూర్వకంగా కలసి పలు విషయాలపై చర్చించినట్లు తెలిపారు. కాగా స్పందించిన మంత్రులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ఎంఎల్ఏను మర్యాదపూర్వకంగా కలసిన తెదేపా నాయకులు

తొట్టంబేడు, సెప్టెంబర్14 ప్రభాతవార్త



వెంకటగిరి ఎంఎల్ఏ కురుగొండ రామకృష్ణను శనివారం తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడులు మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి శివయ్య తీర్థప్రసాదాలను అందించారు. వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలం బొల్లవారి పాలెం గ్రామం, అనుకోలు, సుబ్రమణ్యం బాలయపల్లి గ్రామాల్లో తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలకు ఫించన్లు, రేషన్‌కార్డులు, సిఎం సహాయనిధి, భూ సమస్యలు పరిష్కరించాలని అక్కడ నిరుపేద కార్యకర్తలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయా గ్రామాల్లో రోడ్లు నిర్మించాలని చెరువు మరమ్మత్తులు చేయాలని ప్రజలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గతెలుగుదేశంపార్టీ నాయకులు మధునాయుడు, తొట్టంబేడు బిజెపి అధ్యక్షులు కృష్ణయ్య, తిరుకాలహరిగౌడ్, గోపినాయుడు, తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## 27న తంగేళ్ళపాళెం పిఎసిఎస్ మహాజనసభ

.తొట్టంబేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



ఈనెల 27వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు తంగేళ్ళపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మహాజనసభను నిర్వహిస్తున్నట్లు తిరుపతి అసిస్టెంట్ రిజిస్ట్రార్ మరియు అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి పి.రవిబాబు, సిఈవో చిరంజీవిరెడ్డిలు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో 01.04.2024 నుంచి 31,08.2024 తేదీ వరకు జరిగిన లావాదేవీలు, జమాఖర్చులు పరిశీలించి ఆమోదించటపై, 2023-24 ఆడిట్ రిపోర్టు నివేదికలు పరిశీలన మరియు ఆమోదించుట గురించి జిల్లా కలెక్టర్ ఆర్‌సి నె.350/2022/సి1 తేదీ 23.08.2024 సూచనలను అనుసరించి సంఘంలో కంప్యూటరీకరణలో భాగంగా సంఘ సభ్యులు తమ కెవైసి వివరాలు అనగా ఆధార్, పొలం పాసుపుస్తకాలు, ఇప్పటి వరకు కెవైసి వివరాలుసమర్పించని సభ్యులు మరియు సంఘ సభ్యులుగా ఉండి చనిపోయిన వారిని, సంఘ పరిధిలో నివశించక మరో గ్రామాలకు వలస వెళ్ళిన వారిని, సంఘ పరిధిలో ఉండి గత రెండు సంవత్సరాలుగా సంఘంతో ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరపని సభ్యులను మరియు సభ్యులుగా ఉండి భూమి లేని సభ్యులను గుర్తించి వారి సభ్యత్వం రద్దు చేసి వారిని సంఘ సభ్యత్వం నుంచి తొలగించుట గురించి చర్చ, సంఘంలో గల వాయిదా మీరిన బాకీలపై తగిన న్యాయపరమైన చర్యలుతీసుకొనుట గురించి, పర్సన్ ఇన్‌ఛార్జిప్రవేశపెట్టే ఇతర అంశాలు చర్చించుట గురించి మహాజనసభ నిర్వహిస్తున్నామన్నారు.

## మందుబాబులకు పోలీసుల జరిమానా

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 12మంది వ్యక్తులపై 292 బిఎన్ఎస్ చట్టం ప్రకారం ఒక్కొక్కరికి రూ.1000లు చొప్పున మొత్తం రూ.12,000వేలు, తాగి వాహనాలు నడిపిన ఒక వ్యక్తిపై 185 ఎంవి చట్టం కింద రూ.10వేలు జరిమానా మరియు 25మంది వ్యక్తుల పైన న్యూసెన్స్ చట్టం కింద ఒక్కొరికి రూ.1000 చొప్పున మొత్తం రూ.24వేలు జరిమానాను కోర్టు విధించినట్లు అర్బన్ సిఐ గోపి తెలిపారు.

## ఉచిత పశు వైద్య కేంద్రానికి విశేష స్పందన

రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నా స్వామిపల్లెలో శనివారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం ఆదేశాల మేరకు పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు సూచనలతో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ద్వారా ఉచిత పశు వైద్య శిబిరాన్ని గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ ఎం.సుశీల పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్ మాట్లాడుతూ రాస్ మహిళల కుటుంబాలకు కరకంబాడి పరిసర గ్రామాల్లో విధిగా ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏరియా పశు వైద్యాధికారి స్రవంతి పర్యవేక్షణలో వారి సిబ్బందితో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, రాస్ సిబ్బంది గిరిప్రసాద్, అన్బులగన్, ఇందుమతి, నాగమణి, స్వాతి, శంకరయ్య, గోపాలమిత్ర మునిశేఖర్ క్లస్టర్ లీడర్లు, రైతులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు సృజనాత్మకత నైపుణ్యాలు అవసరం



-ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి విద్య సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 9-9-2024 నుండి 14-9-2024 వరకు బీకాం కంప్యూ టర్స్ విద్యార్థినిలకు నైపుణ్య శిక్షణ తరగ తులు విజయవంతంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్య శిక్షణ సంస్థ, నాంది ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ తెలియజేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థినిలు విజయాలు అందుకోవాలంటే చదువుతోపాటు సృజనాత్మకత నూపుణ్యాలు కలిగి ఉండాలని ఉద్దేశంతో ఈ శిక్షణలో అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ శిక్షణలో విద్యార్థినిలు గ్రూప్ డిస్కషన్స్, సంభాషణ చాతుర్యము, మాట్లాడడంలో నైపుణ్యము వంటి అంశాల పై తర్ఫీదు పొందారన్నారు. విద్యార్థినులలో దాగి ఉన్న అంతర్గత శక్తులకు వెలికి తీయటానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపకరించిందన్నారు. కళాశాల నైపుణ్య శిక్షణ కన్వీనర్ డాక్టర్ కె.పి పద్మజ మాట్లాడుతూ విద్యార్థినిలు ఉద్యోగ ఇంటర్వ్యూ ్యలకు వెళ్లినప్పుడు విజయం సాధించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. నైపుణ్య శిక్షణ మెంబర్ టి శ్రీనాథ్ మాట్లాడుతూ ఈ శిక్షణ తీసుకున్న విద్యార్థినులు ఉద్యోగ ప్రదేశాలలో పనిని వేగంగా చేయడం, అందరితో కలిసి మెలగడం చేస్తారని అన్నారు. ఈ శిక్షణలో నాంది ఫౌండేషన్ శిక్షకులుగా పి.వేణుగోపాల్, కె రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వం పొందండి.. అభివృద్ధిలో భాగస్వాములు కండి..!



బిజెపి జిల్లా అధ్యక్షుడు ఎస్.జగదీశ్వర నాయుడు

చంద్రగిరి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

భారతీయ జనతా పార్టీ సభ్యత్వం పొందడం ద్వారా భారతదేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు ఎస్.జగదీశ్వర నాయుడు కోరారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద శనివారం బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారత్ (వికసిత్ భారత్) ఇది కేవలం ప్రదాని నరేంద్రమోదీ ప్రభుత్వ నినాదం మాత్రమే కాదనీ, బిజెపి లక్ష్యమని అన్నారు. జాతీయవాదం, జాతీయ సమగ్రత, ప్రజాస్వామ్యం, గాంధేయ సామ్యవాదం, సర్వధర్మ సమభావన, విలువలతో కూడిన రాజకీయాలనే పంచనిష్టలకు ప్రతి బిజెపి కార్యకర్త కట్టుబడి వున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కె.వెంకటముని, నాయకులు గాలి పుష్పలత, టి.సుబ్రమణ్యం యాదవ్, కాయం హరినాథ్ రెడ్డి, ఎస్.మునిగంగిరెడ్డి, శ్రీదర్‌బాబు, సునిత యాదవ్, తిలక్, మునెయ్య, ప్రభాకర్ నాయుడు, జనార్ధన్ నాయుడు, లక్ష్మణ్, చైతన్య, దొరస్వామి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడు మృతికి ఎమ్మెల్యే నివాళి

వడమాలపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ నాయ కుడు, విశ్రాంత అటవీశాఖ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ భౌతిక కాయాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శనివారం సందర్శించి నివాళులర్పించారు. వడమాలపేట మండలం పాదిరేడు గ్రామానికి చెందిన బాలకృష్ణ తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా టీఎన్‌టీయూసీ సెక్రటరీ, పారీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని క్రమశిక్షణ, అంకితభావం కలిగిన నాయకుడని తెలుగుదేశం పార్టీకోల్పోయిందని భానుప్రకాష్ పేర్కొన్నారు. బాలకృష్ణ శుక్రవారం రాత్రి వడమాలపేట నుంచి స్వగ్రామం పాదిరేడుకు బైక్‌పై వెళుతుండగా బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం**

తిరుపతి-చెన్నై జాతీయ రహదారి పాదిరేడు క్రాస్ వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్‌తో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఫోన్‌లో మాట్లాడారు. పాదిరేడు వద్ద జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు వివరించి నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ప్రాజెక్టు డైరెక్టర్ త్వరలో సందర్శించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని భానుప్రకాష్ తెలిపారు.

## వైభవంగా గ్రామ దేవతల ఊరేగింపు

నగరి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధి కేవీపీఆర్‌పేటలో గ్రామదేవతలు పొన్నియమ్మన్, పిల్లయార్ గుడి పొన్నియమ్మన్ దేవతల ఊరేగింపు వైభవంగా జరిగింది. వినూత్నంగా ఏర్పాటు చేసిన అలంకరణలో దేవతల ఊరేగింపు కొనసాగింది. అలంకరణను ప్రజలను అమితంగా ఆకట్టుకుంది. బాజా భజంత్రీలు, బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలు అంటూ ఊరేగింపు కొనసాగింది. దారి పొడవునా భక్తులు అమ్మవార్లకు స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టి మంగళహారతులు పట్టారు. ఊరేగింపు పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

## పంతం వీడిన నరసింహయాదవ్



-వివాహంరోజున శ్రీవారి దర్శనం

తిరుమల, సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:

గత ఐదేళ్ల వైసిపి పాలనలో టిడిపి నేతలకు తిరుమలేశుని దర్శనంలో వివక్షత చూపించడం, గత వైసిపి ప్రభుత్వంలో ఇబ్బందులతో టిడిపి నేత నరసింహయాదవ్ తిరుమలకు రాలేదు. దేవుని దర్శనం చేసుకోలేదు. పైగా టిడిపి అధికారంలోకి వచ్చేవరకు స్వామివారి దర్శనానికి రాకూడదని పంతం పూనారు. ప్రస్తుతం రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉండటం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కావడంతో తన వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నరసింహయాదవ్ కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## కోనేటి ఆదిమూలం లైంగిక వేధింపుల నుంచి త్వరగా కోలుకోవాలి

పిచ్చాటూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:



సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గత కొంత కాలంగా లైంగిక వేధింపుల్లో భాగంగా బాధపడుతూ అటు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని, త్వరగా అనారోగ్యం నుంచి కోలుకుని ఈ లైంగిక వేధింపుల కేసు నుంచి బయటపడి మళ్లీ సత్యవేడు శాసన సభ్యులుగా కడిగిన ముత్యంలా మళ్లీ మా నియోజకవర్గానికి ప్రజలకు సేవలు అందించాలని పిచ్చాటూరులో దళిత నాయకులు జలకంఠేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అరుల్ ప్రకాష్, ఏకాంబరం, రజని, రాగమ్మ, ఆర్ముగం, రుకేష్, ప్రకాష్, వడివేలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మారెమ్మ

పిచ్చాటూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మారెమ్మ తెలిపారు. మండలంలోని కొత్త గొల్లకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహారం మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను వైద్యాధికారులు, అంగన్‌వాడీ అధికారులు తిలకించారు. ఆకు కూరలు, కూరగాయలతో ఏర్పాటు చేసిన సమగ్ర శిశు సంక్షేమ చిహ్నం విశేషంగా ఆకర్షించింది. అనంతరం సూపర్‌వైజర్ మారెమ్మ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత దరిచేరదన్నారు. ఆకు కూరలు, గుడ్లు, పండ్లు పాలు తప్పకుండా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నలినాక్షి, హిమశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకట సుబ్బమ్మ, గోవిందమ్మ, హిమబిందు, ఆశ వర్కర్లు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రతిభ విద్యాలయ హైస్కూల్‌లో ఘనంగా హిందీ దివస్ వేడుకలు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:



స్థానిక భవాని నగర్‌లో శనివారం హిందీ దివాస్ జాతీయ హిందీ భాషదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ హాజరై అయితే ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో అందరినీ అలరించారు. స్వాతంత్ర సమరంలో హిందీ భాషను ఆయుధంగా మలుచుకొని పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు హిందీ భాషపై పట్టు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆరోగ్య సంరక్షణలో రక్త కణాలు కీలకపాత్ర పోషిస్తాయి

-ప్రముఖ రక్త సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ ప్రభు

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



ఆరోగ్య సంరక్షణలో రక్త కణాలు కీలకపాత్ర పోషిస్తాయని అపోలో హాస్పిటల్ ప్రముఖ రక్త సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ పి.ప్రభు తెలిపారు. రక్తం నాలుగు ప్రధాన భాగాలతో కూడిన ఒక ముఖ్యమైన ద్రవం ప్లాస్మా ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్స్ ప్రతి ఒక్కటి మన ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. శనివారం అపోలో క్లినిక్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ ప్రభు మాట్లాడుతూ ఎర్ర రక్తకణాలు ఊపిరితిత్తుల నుండి శరీర కణజాలాలకు ఆక్సిజన్‌ను తీసుకువెళ్ళతాయని, ఊపిరితిత్తుల కోసం కార్బన్‌డైయాక్సైడ్ తిరిగి ఊపిరితిత్తులకు తిరిగి పంపుతాయని, ఎర్ర రక్తకణాలలో కీలకమైన ప్రోటీన్ అయిన హిమోగ్లోబిన్ ఈ ప్రక్రియకు కీలకమని తెలిపారు. తెల్ల రక్తకణాలు శరీరానికి రక్షణగా ఉంటూ అంటు వ్యాధుల నుండి రక్షిస్తాయని, రోగ నిరోధకతను పెంచి, అక్రమణదారులతో పోరాటానికి వివిధ రకాల తెల్ల రక్త కణాలు కలిసి పని చేస్తాయని తెలిపారు. రక్తం గడ్డకట్టడానికి ప్లేట్‌లెట్స్ అవసరమని, గాయమైన ప్రదేశాలలో రక్తస్రావం ఆపడం కోసం సేకరించబడతాయని తెలిపారు. పోషక ఆహారం తీసుకోనందున రక్త హీనత ఏర్పాడుతుందని తెలిపారు. తక్కువ ప్లేట్‌లెట్స్, కోగ్యులేషన్ ప్రోటీన్ లోపం ఉన్న రోగిలో అధిక రక్తస్రావం కనిపిస్తుందని తెలిపారు.

## విరాళాన్ని అందిస్తున్న ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్మెంట్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:



ఇటీవల రాష్ట్రంలో సంభవించిన అధిక వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితులకు తిరుపతి జిల్లా ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ తరుపున ఎడిఫై, అకార్డ్, వెరిటాస్ సైనిక్ స్కూల్, సత్యా స్కూల్, కాండోర్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు తమ వంతు సహాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ గారికి అక్షరాల నాలుగ లక్షల రూపాయల చెక్కులను నేటి శనివారం అందజేయడం జరిగినది.

## తిరుపతిలో గంజాయి డోర్ డెలివరీ చేస్తున్న యువకుడు అరెస్ట్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:

తిరుపతిలో గంజాయి డోర్ డెలివరీ చేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నగిరి మండలం ఓజీ కుప్పానికి చెందిన యువకుడు..చెడు వ్యసనాలకు అలువాటు పడ్డారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి రవాణా చేయడంతో పాటు విక్రయాలు చేస్తున్నారు. తిరుపతి ఏజెన్సీలో గంజాయిని కిలో రూ.10 వేలకు కొని చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.300కు అమ్ముతున్నారు. గంజాయి కావాలని ఫోన్ చేస్తే స్విగ్గీ బాయ్‌గా వెళ్లి విక్రయాలకు పాల్పడుతున్నారు. పక్కా సమాచారంతో తిరుపతి మారుతీనగర్ కొత్తపల్లి క్రాస్ వద్ద విఘా పెట్టి అతన్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు...



## రజనీకాంత్ సోదరునికి శ్రీవారి ప్రసాదాలు అందజేత

రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సోదరుడు సూర్య నారాయణరావును బీజేపీ యువ నాయకులు వెంకటాద్రి యాదవ్ శనివారం బెంగళూరులోని ఆయన నివాసం వద్ద కలసి తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. ఆ తరువాత కన్నడ నటులు ఉగ్రం రెడ్డి, మురళిలను మర్యాదపూ ర్వ కంగా కలసి శ్రీవారి ప్రసాదాలను ఇచ్చి వారిని ఘనంగా సత్కరిం చారు.

## ఆధునిక సమాజానికి ఇంజనీర్లు ఎంతో అవసరం - సుప్రజ

రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:

ఆధునిక సమాజానికి ఇంజనీర్ల అవసరం ఎంతో ఉందని సమాజం అభివృద్ధి పథం వైపు పయనిం చాలంటే ఇంజనీర్లదే కీలకపాత్ర అని టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుప్రజ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తుగా ఇంజనీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను సుప్రజ పరిశీలించి ప్రయోగాత్మక రూపకాలు తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. సుప్రసిద్ధ భారత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్పదనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ప్రపంచం గర్వించ దగ్గ ఇంజనీర్ మోక్షగుండం మనదేశంలో జన్మించడం దేశానికి గర్వకారణమన్నారు. తిరుపతి మొదటి ఘాట్ ఎక్కుతున్నప్పుడు ఘాట్‌రూపకర్త విశ్వేశ్వరయ్య ప్రతి ఒక్కరికి గుర్తు కొస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఆయన లాగా దేశానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాధమునిరెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ హెచ్‌వోడీ అనిల్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం అడుసు పాళెం వద్ద శనివారం సుమారు 50 సంవత్సరాల వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. గత మూడు రోజులుగా ఆ వ్యక్తి అదే ప్రాంతంలో తిరుగుతూ స్థానికులు ఇచ్చిన పదార్థాలను తింటున్నాడు. శరీరం అనారోగ్యంతో బాగా బలహీన పడి మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్ఐ వెంకట సుధాకర్ తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆయన తమ సిబ్బందితో సంఘటనా స్థలం చేరుకుని దర్యాప్తు చేశారు.

## సీఐటీయూ మండల కన్వీనర్‌గా ఏ.విజయ్ ఎంపిక

పుత్తూరురూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:

పుత్తూరు మండల కమిటీ విస్తృ స్థాయి సీఐటీయూ కార్యాలయంలో సమావేశం ఎల్ఐసీ లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సీఐటీయూ జిల్లా కోశాధికారి ప్రసాదరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుత్తూరు సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఏ.విజయ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా కో-కన్వీనర్‌గా లలితను, కమిటీ సభ్యులుగా ఎల్ఐసీ నుంచి లక్ష్మణ్‌కుమార్, దస్తగిరి, పి.భాస్కర్, ఆటో పురుషోత్తం, యాసిన్ బాషా, శివ, అంగన్‌వాడీ నుంచి మునికుమారి, విజయ కుమారి, రాధా, బిల్డింగ్ నుంచి నరసింహులు, గోవిందరెడ్డి, సంఘ మిత్ర నుంచి అరుణ, లారీ డ్రైవర్ల నుంచి కృష్ణయ్య, ప్రశాంత్ మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని సీఐటీయూ జిల్లా కోశాధికారి ప్రసాదరావు తెలిపారు.

## లోక్ అదాలత్‌లో 165 కేసులు పరిష్కారం

నగరి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:

స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 165 కేసులు పరిష్కారం కాగా రూ.49.61 లక్షలు సెటిల్‌మెంట్ అయింది. జడ్జి ఎస్.విష్ణువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సివిల్, బ్యాంకు కేసులు, ఎన్ఐ యాక్టు, ఐపీసీ, పీఎల్‌సీ, ఎస్టీసీ కేసులు విచారణకు వచ్చాయి. వీటిలో 165 కేసులు పరిష్కారానికి గురై సెటిల్‌మెంట్ అయ్యాయి. లోక్ అదాలత్‌లో ఏపీపీ రామశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


**Form No.3**
**(See Regulation -15 (1)(a)] /16(3) SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, R/W SUB-RULE (2A) OF RULE 5 OF THE DRT (PROCEDURE) RULES,1993 BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II,1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD -500001**
**O.A. No. 147 / 2024**

**Between:**
**Union Bank of India,** Mangalam branch #9-679, Karakambadi Main Road, Opp to Mangalam Quarters, Tirupathi, A.P -517507, Rep by its Authorised Officer.
**...Applicant**
**And**
1.Mr. Merugu Hema Rani, W/o Merugu Thulasi Ram Aged about 40 years, Occ : Business, D.No.6- 12-17/B2, Kanaka bushnam Layout, Revenue, Ward No.9, near Padmavathi Park, Tirupathi, Tirupathi District -517501. (OR) Office at R/o Lab Technician, Microbiology Department, SVIMS, Tirupathi, Tirupathi -517501.
2. Merugu Thulasi Ram, S/o M. Venkatrathnam, Aged about 46 years, Occ: Business D.No.6-12-17/B2, Kanakabushnam Layout, Revenue Ward No.9, Near Padmavathi Park, Tirupathi -517501.
**...Defendants No.1 and 2**
Whereas **O.A. No. 147 of 2024** was listed before Hon' ble Registrar on **28-08-2024.**
Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for Recovery of debts of **Rs. 21,46,463/-** (application along with copies of documents etc., annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you the defendants are directed as under :
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or asset otherthen properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the asse ts over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before Registrar on 08-10-2024 at 10.30 A.M. failing which the application shall be heard decided in your absence.
Given under my hand and seal of the tribunal on this date of ... August 2024.
**Sd/-Signature of the Authorised Officer to issue Summons**

**CHANGE OF NAME**

I, **YEDOTI VIJAYA**, (old Name) R/at DNo:5/1/4,Thummalagunta, Tirupati Dist, A.P.I have changed my name as **YEDOTI VIJAYAMMA** W/o **YEDOTI ESWARAIAH** (New Name)

I, **KOTTANNAGARI BABAMMA** (old Name) R/at DNo:/86,West Street,Chennur T&M,YSR Dist.A.P.I have changed my name as **ALLI NAGAMMA W/O ALLIES WARAIAH** (New Name)

# ఆకట్టుకున్న ప్రత్యేకాలంకరణలు




కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జరిగిన రథోత్సవం సందర్భంగా ఆలయం వద్ద చేపట్టిన ప్రత్యేక అలంకరణలు భక్తులను విశేషంగా అలరించింది. రథోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రధాన ఆలయాన్ని వివిధ రకాల స్వదేశి, విదేశిజాతి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన ఆలయంలోని గర్భాలయం, అంత్రాలయం, మహామండపం, సుపథమండపంలను వివిధరకాల పుష్పాలు, అరటి చెట్లు, మామిడి తోరణాలతో ఎంతో ఆకట్టుకునే విధంగా అలంకరించారు. అదేవిధంగా ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభానికి విదేశీజాతి పుష్పాలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దీనితో పాటు సుపథమండపంలో వివిధ రకాల ఫల, పుష్పాలు, గింజలతో ప్రత్యేకంగా తయారు చేసిన వినాయకుని ప్రతిమలు కూడా ఎంతో ఆకట్టుకున్నాయి. అలాగే ప్రధాన ఆలయాన్ని మొత్తం పూలతో అలంకరించడంతో ఆలయానికి ప్రత్యేక శోభ సంతరించకుంది.



కాణిపాకంలో నేడు (ఆదివారం)
పగలు : అభిషేకం, బిక్షాండి.
ఉభయదారులు: దేవస్థానం వారిచే తిరుకళ్యాణం
ఉభయదారులు : కాణిపాకం, తిరువణంపల్లె, వణిగ వంశస్థులు
రాత్రి : అశ్వవాహనసేవ
ఉభయదారులు: బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజ వంశస్థులు.
ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు : ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు వై.జయలక్ష్మి,పెనుమూరు వారిచే ధార్మికోపాన్యాసము, 11 గంటల నుండి 12 గంటల వరకు కె.ఆనందర్ తిరుపతి, 12 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మాదురి ఆర్కెస్ట్రా, విజయవాడ, 1 గంటల నుండి 2 గంటల వరకు ఎస్.ఆరతి, తిరుపతి వారిచే భక్తిగీతాలు, 2 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు ఎన్.సుమతి భాగవతారిణి, తిరుపతి వారిచే హరికథ, 3 గంటల నుండి 4 గంటల వరకు అశ్వవామనసేవ ఉభయదారులచే భక్తిగీతాలు, 4 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తిరుకళ్యాణం ఉభయ దారులచే కూచిపూడి, 5 గంటల నుండి 6 గంటల వరకు జ్యోత్స్న తిరుపతి వారిచే భక్తిగీతాలు, 6గంటల న ఉండి రాత్రి 7 గంటల వరకు కె.తేజశ్రీ, కాకర్లవారిపల్లె వారిచే కూచిపూడి, 7 గంటల నుండి 8 గంటల వరకు నృత్యసంగమ,స్నేహలత, బెంగుళూరు, 8 గంటల నుండి 9 గంటల వరకు జిఆర్.మహదేవన్ ఐరాల, 9 గంటల నుండి 10 గంటల వరకు తారకమ్మ ట్రస్ట్ నల్గొండ, 10గంటల నుండి 12 గంటల వరకు శ్రీసీతారామ నాట్యమండలి నెల్లూరు వారిచే కూచిపూడి, భరతనాట్యం, 12 గంటల నుండి అర్ధరాత్రి 2 గంటల వరకు శ్రీవెంకటేశ్వర నాట్యమండలి, నెల్లూరు వారిచే పౌరాణిక నాట్యప్రదర్శనలు.

# గణనాధునికి సాంస్కృతిక నీరాజనం





కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జరిగిన రథోత్సవం సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. రథోత్సవం సందర్భంగా ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తుల కాలక్షేపం నిమిత్తం స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి అర్ధరాత్రి వరకు వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం, ఉభయదారులు ఏర్పాటు చేశారు. అలాగే రథోత్సవం ఊరేగింపు సందర్భంగా గ్రామ పురవీధులలో రాష్ట్రంలోనే పేరొందిన ప్రఖ్యాత కళాకారులచే వైవిధ్యభరితమైన సా ంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రథోత్సవం ముందు పదాతి దళాలు,విచిత్ర వేషదారణలు, రాజరిక వేషదారణ, డప్పు వాయిద్యం, కోలాటాలు, చెక్కభజనలు, పిల్లన గ్రోవి వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకోగా, ప్రదర్శనలతో కాణిపాకం హోరెత్తింది.

# లోక్ అదాలత్ ద్వారా సామరస్యంగా సమస్యలు పరిష్కారం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు**

చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



రాజీ చేసుకోదగిన క్రిమినల్, సివిల్ కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా సామరస్యంగా పరిష్కరించు కోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఇ.భీమారావు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెన్నెల, 1వ అదనపు జిల్లా జడ్జి రమేష, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి, కార్యదర్శి అశోక్ ఆనంద్‌యాదవ్‌లతో కలిసి లోక్ అదాలత్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా ప్రదాన న్యాయమూర్తి ఇ.బీమారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు, న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. మన దేశంలో కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం వుందని, ఏ బంధానికైనా నమ్మకమే ప్రధానమన్నారు. చిన్న గొడవలను ఓర్పుతో పరిష్కరించుకోవాలని, ఈ చిన్న గొడవల కోసం కోర్టు వరకు రానవసరం లేదని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థ వద్ద పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం వుంటుందని, జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు, భూతగాదాలు, మోటర్ వాహనాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఇపి, డివిసి, ఎంసి, బ్యాంకు కేసులు, బిఎస్ఎన్ఎల్, పిఎల్‌పి కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా 9,259 కేసులను గుర్తించడం జరిగిందన్నారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు, చీట్ ఫండ్ కంపెనీలు, బీమా సంస్థల ప్రతినిధులు, కక్షిదారులు పాల్గొని జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్ర స్థాయిలో కేసుల పరిష్కారంలో మొదటి స్థానం దక్కేలా చేయాలని ఆయన సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెన్నెల మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు అదా అవుతుందన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమనే విషయంను అందరు తెలుసుకోవాలని ఆమె కోరారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పరిధిలోని తిరుపతి, మదనపల్లి, తంబళ్ళపల్లి, పీలేరు, వాల్మీకిపురం, పుంగనూరు, పాకాల, పలమనేరు, కుప్పం, పుత్తూరు, నగరి, సత్యవేడు, అలాగే 13 మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో 35 బెంచీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు న్యాయవాదుల సంఘ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా అనేక రకాల కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రమాదాల బారిన పడిన కుటుంబాలు వీధిన పడకుండా బీమా సంస్థలతో వారికి పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. కోర్టుల వల్ల అన్ని విధాల నష్టం జరుగుతుందని కక్షిదారులు భావించి లోక్ అదాలత్ ద్వారా ముందుకు వచ్చి కేసులు పరిష్కరించుకోవవాలన్నారు. గొప్ప మనసుతో ఎదుటి మనిషి తప్పును క్షమిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాదుల సంఘ ప్రధాన కార్యదర్శి అశోక్‌ఆనంద్‌యాదవ్, పోలీసు, రెవెన్యూ, వివిధ బ్యాంకుల అధికారులు, బిఎస్ఎన్ఎల్ అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 18న అన్నా క్యాంటీన్లను ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయండి

**-స్వచ్ఛత హి సేవ కార్యక్రమం విజయవంతం చేయండి:కమిషనర్**



తిరుపతి కార్పొరేషన్,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:
నగరపాలక సంస్థ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు.అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవం పై ఇంజనీరింగ్ అధికారులు అక్షయపాత్ర నిర్వహకులతో శనివారం కమిషనర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు అన్ని హంగులతో స్విమ్స్ కూడలి,న్యూ బాలాజీ కాలని,ముత్యాల రెడ్డి పల్లి,ఇఎస్ఐ హాస్పిటల్ వద్ద గల అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసామని అన్నారు.అయితే మొదటి దశలో ప్రారంభం కాలేదని ఈ 18న రెండవ దశలో ప్రారంభించాలని ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందాయని అన్నారు.ఈ మేరకు నాలుగు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సరిచూసుకోవాలని అన్నారు.క్యాంటీన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు.ప్రజలకు అందించే ఆహారం సరైన సమయంలో ఇచ్చేలా చూడాలని అక్షయపాత్ర నిర్వాహకులను ఆదేశించారు.స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల నిర్వహణ పై ఇప్పటికె అధికారులకు అన్ని విధులు కేటాయించామని అన్నారు.వారందరూ వారికి పనులు సక్రమంగా చేసి,స్వచ్ఛత హి సేవా కార్యక్రమం విజయవంతం చేయాలని కమిషనర్ అన్నారు.ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్,రాజు,హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి,మేనేజర్ చిట్టిబాబు,శానిటరీ సుపర్వైజర్లు చెంచయ్య,సుమతి,మెప్మా కృష్ణవేణి,మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక నగరంలో భక్తితో నగరసంకీర్తన




తిరుపతి, సెప్టెంబర్ 14ప్రభాతవార్త:
తిరుపతిపుణ్యక్షేత్రంలో ప్రతిశనివారం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో భక్తిభావం చాటుతోంది. శనివారం వేకువజామున రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుశీల,మునికుమారి, పద్మ, కల్పన, ఉషారాణి, భారత్, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసురెడ్డి, మునినాథరెడ్డి, కస్పాపద్మనాభం, శాంభోలు హరినాథ్, పొన్నాలజేజిరెడ్డి,నాగరాజు,. రాజశేఖర్‌రెడ్డి వాసు,సాయిరెడ్డి తదితరులు తిరునామం ధరించి భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో గోవింద నామాలతో కదిలారు. గోవిందరాజస్వామి ఆలయం,మాఢవీధులు, నాలుక్కాళ్ళమండపం వరకు మంగళవాయిద్యాల నడుమ సాగింది. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

# పవిత్రాల ఊరేగింపు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్లతోపాటు పరివార దేవతలకు సమర్పించే పవిత్రాలు, పట్టు వస్త్రాలను ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపం నుంచి పట్టు వస్త్రాలును పూజలకు తరలించారు.ఆలయంలో వాటిని ఊరేగింపుగా భక్తులకు దర్శన మిచ్చారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రదాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ ఉదయం యాగశాలలో శాస్త్రోక్తంగా హోమాలు జరిపారు. తరువాత సుగంధ ద్రవ్యాలను పవిత్రాలను ఆలయ ప్రాకారంలో ఊరేగింపు జరిపారు. ఈకార్యక్రమాల్లో డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, అలంకార గురుకుల్ సూరిగురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి, తేవారం గురుకుల్ ముత్తుకుమార్‌స్వామి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్,సిఎస్ఒ నాగభూషణం యాదవ్,సూపరింటెండెంట్ విజయసారధిలు వెంటరాగా పవిత్రాలను ఊరేగించారు. వీటిని యాగశాలకు తరలించారు. అక్కడ డాక్టర్ స్వామినాధన్ పూజలు నిర్వహించారు. హారతులిచ్చారు.

# నవ సమాజ మార్గదర్శకులు గురువులు

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:
సమాజంలో గురువులకు అరుదైన స్థానం కలదని, నవ సమాజ మార్గదర్శకులు గురువులని ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురుబ్రహ్మ గురు విష్ణు...గురు దేవో మహేశ్వర: అనే శ్లోకాన్ని నిజం చేస్తూ చంద్రగిరి నియోజకవర్గం స్థాయిలో ఉన్న ఉపాధ్యాయులను సన్మానించి, గౌరవించడం మన బాధ్యతగా భావిస్తున్నామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం గురుపూజోత్సవం వేడుకలను తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ ప్రతి మనిషికి తల్లిదండ్రుల తర్వాత గురువే మార్గదర్శి అని అన్నారు. గురువు ఎలాంటి స్వార్ధం లేకుండా కులమతాలకు అతీతంగా నిస్వార్ధంగా విద్యార్థులందరికి చదువు నేర్పుతారని తెలిపారు. రాజకీయ నాయకుడు కూడా గెలిచిన తర్వాత పార్టీలకు కులమతాలకు అతీతంగా నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా పని చేస్తారని తెలిపారు. సమాజంలో గురువు పాత్ర కీలకమని, పిల్లల బంగారు భవిష్యత్‌కు పునాదులు వేస్తారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు విద్యా వ్యవస్థను మెరుగుపరచటానికి శక్తివంఛన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. స్కూల్స్, కళాశాలలో, విద్యా వ్యవస్థలో ఏదైన సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకువస్తే దగ్గరుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



అనంతరం చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా ఉపాధ్యాయులను దుశ్శాలవతో ఘనంగా సత్కరించి, మెమెంటోలను అందజేసారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుచ్చి వాహనంపై దేవేరులతో కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఆగస్టు 14 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం దేవదేవుడైన శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారు తన దేవేరులు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వి.రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ మోహన్ నాయుడు, అర్చకులు దివి మురళి కృష్ణమాచార్యులు, అధ్యాపక గోపాల్ భట్టాచార్య సంతాన కృష్ణన్, పరిచారిక డాక్టర్ లక్ష్మి రాజేష్, నాళ్ళురి విష్ణుమూర్తి, జమేధార్ మంకు చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

# శనీశ్వరునికి విశేషాభిషాకాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిటలాడింది.వరుస సెలవులు రావటంతో రద్దీ ప్రారంభం అయ్యింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. అంతేకాక ముక్కోటి దేవతలకు నిలయంగా ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు నిరీక్షించారు. ఇక్కడకు వచ్చిన భక్తులకు దర్శనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఇఓ పర్యవేక్షించారు. సమయ పాలనను పాటిస్తూదర్శనాలు కల్పించారు.సుమారు 25వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు అంచనా.

**శనీశ్వరునికి షోడషాభిషేకాలు...**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరునికి విశేషంగాషోఢషాభిషేకాలు నిర్వహించారు. దక్షిణభారత దేశంలో ఎక్కడా లేని విధంగా వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసినదివ్యక్షేత్రంలో శనీశ్వరుడు విగ్రహ రూపంలో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఈ నేపధ్యంలో శనీశ్వరునికి షోఢషాభిషేకాలు అందించారు. ఈ ఆలయం వద్ద భక్తుల తాకిడి అధికంగా కనబడింది. అయితే దళారుల ఆట కట్టించుటకు అధికారులుసిసి కెమెరాలను పరిగణలోకి తీసుకున్నారు. ఇక్కడ 73 శనీశ్వర అభిషేకాలను భక్తులు జరిపించుకోగా రాహుకేతుదోష నివారణ పూజలను సుమారు 4143లు జరిపించుకున్నారు. ఇక అభిషేకాలు 66 జరగగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 36 జరిగాయి. భక్తుల రాక పరిమితంగా ఉంది.

# వరద బాధితులకు అండగా ఉంటాం..

గంగవరం,సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :
విజయవాడ వరద బాధితులకు అండగా ఉంటామని మదర్‌థెరిసా కళాశాల ఛైర్మన్ ఎంఆర్.సునీల్ పేర్కొన్నారు.ఈ నెల 12న అమరావతిలోని సెక్రటరియేట్‌లోమదర్‌థెరిసా కళాశాల ఛైర్మన్ ఎంఆర్.సునీల్ మంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.10 లక్షల చెక్కును వరద బాధితులకు విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుతో మదర్‌థెరిసా కళాశాల ఆధ్వర్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు,యాజమాన్యం విరాళాలు సేకరించిన



## మంత్రికు రూ.10 లక్షల చెక్కును అందజేసిన మదర్‌థెరిసా కళాశాల యాజమాన్యం

రూ.10 లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించామన్నారు.అకాల వర్షాల కారణంగా భారీ వర్షాలతో వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోయిన విజయవాడలోని బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి విరాళం అందించిన మదర్‌థెరిసా కళాశాల ఛైర్మెన్ సునీల్‌ను మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందిచారు.గత 10 రోజులుగా వరద బాధితులు సర్వం కోల్పోయి కొట్టుమిట్టాడుతున్న వారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండగా ఉన్నారని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# తరచూ మృత్యుపాలవుతున్న నార్త్‌ఇండియా యువకులు

తడ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త
తడ మండల పరిధిలోని పలు పరిశ్రమల్లో పనిచేయడానికి వస్తున్న నార్త్‌ఇండియా యువకులు అలజడులు చేయడం కాకుండా అనవసరంగా మృత్యుపాలవుతున్నారు. గత రెండురోజుల్లో జరిగిన మూడు సంఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. ఇద్దరు ప్రాణాలో కోల్పోగా, మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు, కాదలూరు సమీపంలోని ఒక లేఅవుట్‌లో బీహార్‌కు చెందిన బాబులాల్ (32) శవమై కనిపించాడు. అతను శుక్రవారమే ఈ ప్రాంతానికి వచ్చి కొండూరు వద్దనున్న ఒక పరిశ్రమలో పనికి కుదిరాడు. అంతకుమందు అతని బంధువులు, స్నేహితులు ఇక్కడ పనిచేస్తున్నారు. వారితో కలిసి వారు అద్దెకు తీసుకున్న ఇంట్లోనే అతను దిగాడు. అయితే అర్ధరాత్రి నుంచి అతను కనిపించలేదు. సహచరులు గాలించారు. ఈ యువకుడు సమీపంలోని ఒక



కాదలూరు వద్ద అనుమానాస్పదంగా మృతిచెందిన బాబులాల్

లేఅవుట్‌కు వెళ్లి అక్కడ వాచ్‌మెన్‌ను కొట్టి అనంతరం ఒక భవనం నుంచి పడి మృతిచెంది ఉండగా శనివారం ఉదయం కనుగొన్నారు. మరో సంఘటనలో తడకు సమీపంలోని శ్రీసిటీ సెజ్‌లో పనిచేస్తున్న సూరజ్ (30) అనే ఉత్తరాది యువకుడిని ప్రత్యర్థులు వెంటాడి తడ బజారులోనే కొట్టి గాయపరిచారు. అతను స్థానిక శ్రీకాళహస్తి రోడ్డులో నడుచుకుంటూ వెళుతుంటే ముగ్గురు దుండగులు వెంటాడి కొట్టడం కాకుండా రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ప్రస్తుతం అతను తీవ్ర గాయాలతో ఆసుపత్రిపాలయ్యాడు. శుక్రవారం జరిగిన మరో సంఘటనలో స్థానిక శ్రీసిటీ మలుపు వద్ద మోటార్‌బైక్‌పై వెళుతున్న కమిల్ మాలిక్ (25) అదుపుతప్పి పడి మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్‌కు చెందిన ఈ యువకుడు కొంతకాలంగా సహచరులతో కలిసి ఇక్కడే నివాసముంటూ ఇనుప స్క్రాబ్ వ్యాపారం చేస్తున్నాడు. అతని బంధువులను పోలీసులు ఉత్తరప్రదేశ్ నుంచి రప్పించి పోస్టుమార్టం నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం ఇంతదూరం వస్తున్న యువకులు పారిశ్రామికవాడల సమీపంలో పదేపదే ప్రమాదాలకు గురవుతూ అలజడులు కలిగిస్తూ మృతువుపాలవడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. పోలీసులు కూడా వీరి శవాలను భద్రపరచడం, బంధువులను, స్నేహితులను రప్పించడం కొన్నిసార్లు కష్టసాధ్యమవుతోంది.